

రాయవరపు వేంకటరత్నాకర్‌రావు

# సూర్యుడు - నక్షత్రము

**1.** అమెరికాలో ఏదైనా ఉద్యోగం
2. ఇంగ్లాండులో ఏదైనా ఉద్యోగం
3. యూరోపు, ఆస్ట్రేలియా లేదా కెనడాలో ఏదైనా ఉద్యోగం
4. సింగపూరు లేదా గల్ఫ్‌లో ఏదైనా ఉద్యోగం
5. వేరే ఏదైనా విదేశంలో ఇంజనీరు లేదా డాక్టరు ఉద్యోగం

అని రాసి ఉన్న కాయితాన్ని నా మొహాన కొట్టారు నాన్న.

ఏదో పుస్తకం చదువుతున్న నేను ఆ కాయితాన్ని చదివి, 'ఏమిటి నాన్నా ఇది, ఏదో పట్టికలా ఉందే' అన్నాను. దానికి నాన్న 'అవును పట్టికే. ఆ గాజువాక సంబంధం వాళ్ళు పెళ్ళికొడుకుని ఎంచే క్రమంలో పాటించే పద్ధతిట. ఈ పట్టికలో ఏదో ఒక అర్హత ఉన్నవాళ్ళకు మాత్రమే వాళ్ళ అమ్మాయిని చూపిస్తారట. ఈ పట్టికలో నీ అర్హత ఎంత పైన ఉంటే, నీకు ఆ అమ్మాయి దొరికే అవకాశం అంత ఎక్కువట' అని నాకు చెప్పి, అమ్మ వైపు తిరిగి, 'అంటే అర్థం ఆ అమ్మాయి మన వాడి ముఖం చూడను కూడా చూడ'దని అన్నారు.

'పోనీ లెండి, ఆ పిల్లకు అదృష్టం లేదు. లేకపోతే మనవాడిని చూడకుండానే వద్దనుకోవడమేమిటి?' అంది అమ్మ.

'అదేమీ లేదు. ఈ కాలంలో అంతా అలాగే ఆలోచిస్తున్నారు. అందులో వాళ్ళ తప్పేమీ లేదు. మన పెద్దవాయిని ఇంజనీరింగులో సీటు సంపాదించమని చిన్ననాటి నుంచీ చెవిని ఇల్లు కట్టుకుని పోరాను. నీ సుపుత్రుడు మాత్రం ఆడుతూ, పాడుతూ కాలం గడిపేశాడు. పైగా వీడి స్నేహం రమేశ్ లాంటి తెలివైన కుర్రాడితో కాకుండా ఎందుకూ పనికిరాని ఆవారాయిలు ఆ అనంత, సునీల్‌ల తోటి. ఒక్క ఎంట్రన్సు రాసి ఇంజనీరింగు సీటు తెచ్చుకోలేకపోయాడు. ఇప్పుడు ఏమిటో యూనివర్సిటీలో, రీసెర్చులా అంటూ లైబ్రరీల చుట్టూ, లేబరేటరీల చుట్టూ అక్కడ్నుంచి తిరుగుతున్నాడు. మరి ఎవరిని ఉద్ధరించడానికో. ఏదో నాటికి ఒక్కడి పిల్లను చూసి పెళ్ళి చేసి బాధ్యత వదిలించుకుందామని నేను అనుకుంటే, ఇదిగో ఇలా అడుక్కునే తంత్రం చేత ఛీ కొట్టించుకోవలసి వస్తోంది!' అంటూ పురాణం మొదలుపెట్టారు నాన్న.

"నాన్నా, ఇంజనీరింగులో ఐ.ఐ.టీ. సీటు సంపాదించాలనీ, అమెరికాలో, ఇంగ్లాండులో వెళ్ళాలనీ నేనూ అనుకున్నాను. కానీ

అవి కుదరలేదు. అలా అని జీవితాంతం బాధపడుతూ కూర్చోమంటావా? జీవితంలో పైకి ఎదగటానికి వేరే ఎన్నో దారులున్నాయి. పైగా ఇప్పుడు నేను చేస్తున్న పనిలో నాకు అభిరుచి ఉంది. ఏ నాటికైనా దీనిలోనే రాణిస్తాను. పెళ్లీ, గిళ్లీ ఆ తరవాతే!' అని గదిలోంచి వెళ్లిపోయాను నేను.

'మా నాన్న నన్ను దెప్పటం మాత్రం మానలేదురా!' అన్నాను చాలా రోజుల తరువాత కలవటానికి వచ్చిన ఆనంద్‌తో.

'ఏ విషయం గురించిరా...' అడిగాడు ఆనంద్.

'అదేరా... ఆయన నా చదువు కోసం చేసిన ఖర్చుకు నేను న్యాయం చెయ్యలేదుట. నేను మనస్సుపెట్టి, కష్టపడి చదవకుండా సభలూ, సమావేశాలూ అంటూ తిరిగానట. అవి కట్టిపెట్టి బాగా చదివివుంటే ఈ పాటికి ఆ రమేశ్‌లా నేను అమెరికాలో సెటిలయ్యేవాడినట. అంతే కాదు, నా గురించి పిల్లను వెతకాలన్నా బంధువర్గంలో చెప్పుకోవాలన్నా తల కొట్టేసినట్టుగా ఉందిట. ఇవీ ఆయన ఫిర్యాదులు. రోజూ ఏ వంక దొరికినా అది పట్టుకుని నన్ను ఈ విధమైన మాటలంటారు. ఉదాహరణకి ఏ టీ.వీ చానలులోనైనా ఏ అమెరికానో, ఇంగ్లాండునో చూపిస్తున్నారనుకో, మా నాన్న నన్ను పిలిచి, ఇదిగో ఎలాగూ నీకు వెళ్లే యోగం లేదు. ఇలా అయినా చూసి సంతోషించు అంటారు. లేదా ఆయన పరిచితులు ఎవరన్నా తమ పిల్లలు విదేశాలలో తీయించుకున్న ఫోటోలు చూపిస్తే, నీ ఫోటోలు ఇలా చూసే అదృష్టం ఈ జన్మకు ఇక లేదు కదా అంటారు. ఈ మాటలు రోజూ విని, విని నాకు అలవాటైపోయాయి' అన్నాను నేను.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం- ఏ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**

ఆనంద్ నవ్వుతూ, 'అయితే నేను అదృష్టవంతుడినేరోయ్... మొదట్లో మా నాన్న కూడా ఇప్పుడు నువ్వు చెప్పినట్టుగానే ప్రవ ర్తించేవాడు. మా ఇంటికి మా స్వగ్రామం నుంచి ఎవరన్నా వస్తే బియ్యే చదివిన గొడ్ల కాపరి కావాలా అనేవాడు. అయితే క్రమ క్రమంగా ఆయనలో చాలా మార్పు వచ్చింది. ఇప్పుడు ఆయన నా పట్ల నేను చేస్తున్న వృత్తి పట్ల తృప్తిగానే ఉన్నారు. నువ్వు ఏమీ బాధపడకు. మీ నాన్నకి నీ మీద ప్రేమ, అభిమానం తప్పితే మరే చెడు భావనా ఉండదు. ఆయన నిన్ను అంటున్న మాటలని మనస్సుకి తగలన్వికు' అన్నాడు.


'లేదురా... ఆయన మాటలకి నేను బాధపడటం లేదు. కానీ ఆయనను కూడా ఒక తండ్రిగా తృప్తిపరిస్తే అది నాకూ తృప్తీ, సంతోషమూను. అసలు మనిద్దరికీ ఆ రమేశ్‌గాడు ఎక్కడ దొరికాడురా బాబూ... వాడితో పోల్చి వాడిలా ఉండమంటే ఎలా చెప్పు. వాడేమో అక్కడ హాయిగా అమెరికాలో కూర్చున్నాడు. వాడి పేరు చెప్పి ఇక్కడ రోజూ మనకు అక్షింతలు పడుతున్నాయి' అన్నాను నేను. అలా మా మాటలు రమేశ్ మీదికి మళ్లాయి.

రమేశ్, ఆనంద్, నేను-మేము ముగ్గురం ఒకే బెంచీలో ఇంటర్మీడి యటు వరకూ చదువుకున్నాము. రమేశ్ చాలా తెలివైనవాడు. లెక్కల్లో చాలా చురుగ్గా ఉండేవాడు. అందుకే పదపతరతగతి తరవాత ఎంపీసీ గ్రూపు తీసుకున్నాడు. నాకు కూడా మేథ్స్‌లో మంచి మార్కులే వచ్చేవి కాబట్టి, నేనూ అదే గ్రూపు తీసుకున్నాను. కానీ ఆనందుకి లెక్కల్లో ప్రావీణ్యం, అభిరుచి రెండూ తక్కువే. ఎప్పుడూ 100కి 50 మార్కులు దాటలేదు. కానీ వాళ్ల నాన్న వాడిని ఇంజినీరు చెయ్యాలనే కోరికతో బలవంతంగా ఎంపీసీలో జాయిన్ చేశారు. సునీల్ కూడా మాతోటివాడే కానీ, వాడు ఉన్నది పేరుకే. ఏ నాడూ కాలేజీకి వచ్చిందీ లేదు. పై చదువుల గురించి ఆలోచిందీ లేదు. పరీక్షల సమయానికి మాత్రం మా ఇంటికి వచ్చి నా నోటు పుస్తకాల సహాయంతో సమాధానాలు బట్టీ వేసేవాడు. ఎంసెట్టు, ఐ.ఐటీ.ల మహాసంగ్రామానికి సునీలు మినహా మేమంతా ఎవరి కృషి వాళ్లు చేశాము. కాని రమేశులా నేను, ఆనందు పూర్తిగా పుస్తకాల పురుగులం కాదు. నాకు రకరకాల సాహితీసభలు, సమావేశాలన్నా, వక్తృత్వపు పోటీలన్నా ఆసక్తి ఎక్కువ. వాటి వల్ల బోలెడు సాహితీ జ్ఞానమూ, కప్పులూ, షీల్డులూ వచ్చాయి కాని క్లాసులు, ట్యూషన్లు పోతూ ఉండేవి. ఇక ఆనంద్‌కి సినిమాల పిచ్చి విపరీతంగా ఉండేది. సినిమాలలో ఉన్నంత ఎడ్యుకేషన్ క్లాసు పుస్తకాలలో లేదనేవాడు. సంవత్సరంలో రిలీజైన సినిమాలన్నీ చూసేవాడు. చాలాసార్లు క్లాసులు ఎగ్గొట్టి కూడా. మా ప్రయత్నలోపమో, లేద ఇంజినీరింగ్ పట్ల పూర్తి ఆసక్తి లేకో, మొత్తానికి నాకూ, ఆనంద్‌కీ ఇంజినీరింగ్ సీటుకి సరిపడే ర్యాంకు రాలేదు. అప్పట్లో టెస్టుకు కూర్చుంటే చాలు. సీటు దొరికేలా ఇన్ని ఇంజినీరింగు కాలేజీలు ఉండేవి కాదు, పట్టుమని పాతిక కాలేజీలు ఉండేవి. కానీ రమేశ్ ఎంసెట్టులోనే కాదు, ఐ.ఐటి ఎంట్రన్సులో కూడా సీటు సంపాదించాడు. ఆ తర్వాత రమేశ్ చదువు పూర్తి అవడమూ, పై చదువులకి అమెరికా వెళ్లడం, ఆ తరవాత అక్కడే ఉద్యోగంలో స్థిరపడడం జరిగాయి.

నన్నూ, ఆనంద్‌నీ, మా తల్లితండ్రులు మళ్లీ, మళ్లీ ఎంసెట్టు దండయాత్రలు చెయ్యమన్నారు కానీ, అప్పుడు ఫలితం అనిశ్చితం కాబట్టి, దాని కోసం మా తల్లితండ్రుల డబ్బు ఇంకొంచెం దండగ చేయడం ఇష్టం లేక నేను బీయెస్సీలోను, ఆనంద్ బియ్యేలోను చేరిపోయాము. ముందే చెప్పానుగా, నాకు మేథ్స్, సైన్సులు అంటే ఇష్టమేనని. చకచకా బీయెస్సీ, ఎమ్మెస్సీ పూర్తి చేసి పీహెచ్డీకి చేరాను. ఆనంద్ పూర్తి చేసిన తరువాత డిజిటల్ ఫోటోగ్రఫీలో కోర్సు చేసి ఒక చిన్న ఫీచరు ఫిల్ము ప్రొడక్షను కంపెనీ ప్రారంభించాడు. ఆంధ్రదేశంలో ఉన్న పురాతన దేవాల యాలు, పర్యాటకప్రదేశాల గురించి చిన్న చిన్న వీడియోలూ, డాక్యుమెంటరీలూ తీసి టీ.వీ చానల్సు ప్రసారం చేయడానికి విక్రయించడం వాడి వృత్తి.

అడపాదడపా రమేశ్ కబుర్లు తెలుస్తూనే ఉన్నాయి. రెండేళ్ల క్రితం వరకూ కూడా రమేశ్ వాళ్ల నాన్నగారు, మా నాన్నకు అప్పుడప్పుడు కనడుతూనే ఉండేవారు. కనపడినప్పుడల్లా రమేశ్ అమెరికాలో తీయించుకున్న ఫోటోలు చూపించడమో, అతనికి అమెరికాలో డాలర్లలో ఇస్తున్న జీతాన్ని రూపాయల్లోకి మార్చి చెప్పడమో, అక్కడి జీవితవిశేషాలు వర్ణించడమో చేసేవారు. ఇవన్నీ విన్న మా నాన్న అవి గుర్తుకు వచ్చినప్పుడల్లా నన్ను ఏదో ఒకటి అనడం పరిపాటి అయ్యింది. ఇది ఎవరికో చెప్పుకుని బాధపడేంత పెద్ద విషయం కాదు. కానీ చాలా కాలం తరవాత ఆత్మీ యుడైన ఆనంద్ కనిపించడంతో, మనస్సు లోంచి బయటపడింది.

'మా నాన్నా అలాగే ఉండేవాడురా. నిజానికి నాన్నలంతా అలాగే ఆలోచిస్తారేమో. సాధారణంగా ఎవరైనా ఇంటికి అతిథులు వస్తున్నారు అంటే ఏం చేస్తారు? ముందు గదిని శుభ్రం చేసి, అందంగా అలంకరి స్తారు. అక్కడ చెత్తా, చెదారం ఏదన్నా ఉంటే పడకగదిలోనన్నా పడేస్తారు కానీ ముందు గది డాబును, దర్జానూ పాడవనివ్వరు. అంతే శుభ్రంగా, అందంగా తమ వంటింటినో, పడకగదినో ఉంచుకోవచ్చు అని కానీ, లేదా రోజూ ఇంతే దర్జాగా బ్రతకవచ్చు కదా అని కానీ ఆలోచించరు.



వాళ్ల ఆలోచన అంతా, సమాజం వాళ్ల దర్జా గురించి గొప్పగా చెప్పుకోవాలి అనే తప్ప, తాము నిజంగా దర్జాగా బ్రతుకుతున్నామా లేదా అని కాదు. మన నాన్నలూ అంతే. నిజంగా వాళ్లు సంతోషంగా ఉంటున్నారో లేదో ఆలోచించడం లేదు. తాము సంతోషంగా ఉన్నామని సంఘం అనుకుంటే చాలనుకుంటున్నారు. మన అభివృద్ధిని సంఘం గుర్తించాలనేదే వాళ్ల కోరిక. దేశమంతా ఇంజినీరింగు అన్నా, విదేశాలలో ఉద్యోగమన్నా ఆకాశాని కెత్తేస్తోంది. కాబట్టి మన వాడిని కూడా ఆ దారిలోకి తోసేద్దామని వాళ్ల ఆలోచన. దాని వల్ల తాము సాధించలేని సామాజికప్రాముఖ్యం కూడా వారికి దొరుకుతుంది. మీ నాన్నా, మా నాన్నా, రమేశ్ వాళ్ల నాన్నా అలా ఆశ పడ్డవారే. రమేష్ పరిశ్రమ వల్లనైతేనేం, వాడికి ఆ రంగంలో ఉన్న అభిరుచివల్లనైతేనేం, వాళ్ల నాన్న అనుకున్నదాన్ని వాడు సాధించాడు.

దానితో నలుగురులోనూ రమేశ్ వాళ్ల నాన్న రాఘవరావు గారి గౌరవం పెరిగిపోయింది. 'మీకేమండి అదృష్టవంతులు, మీ అబ్బాయి అమెరికాలో ఉన్నాడు' అని కొందరు, 'మీ వాడినడిగి అమెరికా నుండి ఫలానాది తెప్పించండి' అని కొందరు,' మా మేనల్లుడు డిగ్రీ పాసయ్యాడు, అమెరికా వెళ్లాలంటే ఏం చేయాలో మీ వాడినడిగి చెప్పండి' అని మరి కొందరు, ఇలా ఎవరో ఒకరు ఎప్పుడూ ఆయనను చుట్టేసేవారు.

ఇవన్నీ చూసి, రాఘవరావు గారు చెప్పిన కబుర్లు విని మన నాన్నలు చిన్న బుచ్చుకుని ఆ నిరాశనంతా మన మీద చూపించేవారు. మనం వెళ్తున్న దారులు కూడా మంచివేనని, మనం సంతోషంగా ఉండగలమని, వారిని సంతోష పెట్టగలమని ఆలోచించలేదు. ఇక్కడి వరకూ నీకూ, నాకూ తెలిసిన కథే. ఆ తరవాత ఏం జరిగిందో చెప్తాను విను. రాఘవరావు గారు మా నాన్నను అడపా దడపా కలుస్తూనే ఉండేవారు. ఒకే కాలనీలో ఉంటాము కదా. రేండేళ్ల క్రితం ఆయన, వాళ్ల అమ్మాయి, అదే నీకూ తెలుసు కదా ఆ అమ్మాయి పూర్ణ పెళ్లి తల పెట్టారు. పెళ్లి అంటే మాటలా చెప్పు ముందు పెళ్లికొడుకు ఎన్నిక, తరవాత పెళ్లి ఏర్పాట్లు, పిలుపులూ, పెళ్లి బట్టలూ, నగలూ కొనడం, పెళ్లివారితో సంప్రదింపులూ వగైరా, వగైరా. వీటన్నిటికి డబ్బుసాయం ఉంటే సరిపోదు, మనిషి సాయం కూడా కావాలి కదా. రమేశ్ విదేశంలో ఉద్యోగంలో ఉన్నవాడు. డబ్బు సాయం ఎంతైనా చెయ్యగలడు కాని మనిషి వచ్చి నెలలకు నెలలు ఉండిపోలేడు కదా. పెళ్లికి అందరి చుట్టాలగానే రమేశ్ వచ్చి వెళ్లాడు అంతే. పెళ్లికి పడ్డ శ్రమంతా రాఘవరావుగారిదే. ఆ పెళ్లి తరవాత ఆయన శారీరకంగా, మానసికంగా అలసిపోయారు. కొన్ని నెలల తరవాత ఆయన అమెరికా వెళ్లి ఓ రెండు నెలలు కొడుకు, కోడలు, అప్పుడే పుట్టిన మనవరాలితో గడిపి వచ్చారు. ఆ రెండు నెలలూ మనవరాలు అంటే విపరీతమైన చేరిక, మమకారం ఏర్పడ్డాయి. తిరిగి వచ్చేటప్పుడు ఆమెను వదిలి రాలేక చిన్న పిల్లాడిలా వలవలా ఏడుస్తూ వచ్చారు. ఆ వయస్సులో పెద్దవాళ్లకి మనవల ఆటపాటలే కదా ముచ్చట! వాటన్నిటికీ దూరమయ్యానని, కొడుకునీ, మనవరాలిని ఏడాదికో, రెండేళ్లకో తప్ప చూడను అని తలుచుకుంటూ బాధ పడేవారుట. రమేశ్ అక్కడి జీవితాన్నీ, వృత్తినీ వదిలి రాలేడు. బోలెడు డబ్బు ఖర్చు చేసి ఈయన అమెరికా వెళ్లగలిగినా జీవితాంతం ఉండడానికి వీసా దొరకదు కదా. పైగా ఈ మధ్య మంచి అర్హతలున్నవారే కాకుండా డబ్బు పెడితే ఎవరైనా విదేశాల కెళ్లి చదువుకునే అవకాశం ఉండటం, ఉన్నతమైన చదువులూ, ఉద్యోగాలూ మన దేశంలోనే లభ్యం కావడం, అవి సంపాదించినవారికి విలాసమైన జీవనశైలి ఇక్కడే దొరకడం-వీటన్నిటి వల్లా నలుగురిలోనూ రాఘవరావు గారి ప్రత్యేకత తగ్గిపోయింది. ఒంట్లో సత్తువ ఉన్నప్పుడే ఇలా ఉంటే, ఇక వయస్సు బాగా మీద పడితే దగ్గర చూసుకునేవారు ఎవరూ లేకపోతే ఎలా ఉండటమూ అనే దిగులు ఒకటి పట్టుకుంది. వీటన్నిటి వల్లా ఆయన

మానసికంగా క్రుంగిపోయారు. ఆయన తన భావాలన్నిటినీ కలిసినప్పుడల్లా మా నాన్నతో చెబుతుండేవారు. ఇవన్నీ విన్న మా నాన్న ఆలోచనలు, క్రమక్రమంగా మారడం మొదలైంది. ఎందుకంటే ఇన్నేళ్ల బట్టీ మా ఇంటిలో కథైనా, కార్యమైనా నేను మా నాన్నకి శ్రమ అనేది తెలియనివ్వలేదు. పైగా నాకు చేతనైనంత డబ్బు సాయం చేశాను కూడా. పైగా నేను నాకు ఇష్టమైన రంగంలో ఉన్నాను, కాస్తో కూస్తో పేరు తెచ్చుకున్నాను. చాలినంత సంపాదిస్తూ మా అమ్మనీ, నాన్ననీ బాగా చూసుకుంటున్నాను. నేను ఈ ఊరినీ, వాళ్లనీ వదిలివెళ్లనని వాళ్లకీ భరోసా. బయట వాళ్లు పొడిగినా, పొగడకపోయినా ఇలా ఉండటంలో నా సంతోషం, వాళ్ల సంతోషం కూడా ఉందని తెలుసుకున్నారు. ఇప్పుడు మా నాన్నకి నేనంటే ప్రేమే కాదు, గర్వం కూడా. ఇప్పుడు నువ్వు చెప్పినది వింటుంటే నీదీ, నాదీ ఒకే కథలా అనిపిస్తోంది. అందుకే చెప్తున్నా మా నాన్నా, మీ నాన్నా కలుసుకునే అవకాశాలు కల్పిద్దాము. కచ్చితంగా మీ నాన్నగారు కూడా వాస్తవంలోకి వస్తారు' అని ముగించాడు ఆనంద్.

నాన్న మెల్లగా సూటిపోటి మాటలనడం తగ్గించారు. నేను కూడా నా పీహెచ్డీ రీసెర్చిలో లీనమైపోయాను.

ఒకనాడు ఆనంద్ నుంచి ఫోను, 'ఒరే, నేను తీసిన డాక్యుమెంటరీ ధారావాహిక హక్కులని 'డిస్కవరీ' చానలు వాళ్లు కొంటున్నారు. 'మిస్టీరియస్ టెంపుల్స్ ఆఫ్ సౌతిండియా' పేరుతో ప్రపంచమంతా ప్రసారం చెయ్యబోతున్నారు. ఈ పూటే ఒప్పందం కుదిరింది. తెలిస్తే నువ్వు సంతోషిస్తావని నీకు వెంటనే ఫోను చేశాను' అన్నాడు.

ఎవరికైనా విదేశీయుల గుర్తింపు లభిస్తే ఆకాశానికెత్తేస్తే ప్రచారసాధనాలు, ఆనందు పేరును స్వదేశంలో కూడా మారుమ్రోగేలా చేశాయి. మా నాన్నకి ఈ విషయం చెప్పాను, 'ఎవరినైతే నువ్వు జులాయి అన్నావో, ఇప్పుడు వాడి పేరు ప్రపంచమంతా మ్రోగిపోతోంది. వాడి ఇంట్లో కనకవర్షం కురుస్తోంది' అన్నాను.

'సంతోషం. కానీ అలాంటిదేదైనా నువ్వు సాధిస్తే అప్పుడు చెప్పు. ఇంకా సంతోషిస్తాను' అని ఊరుకున్నాడు నాన్న.

నా రీసెర్చి చాలా కీలకస్థితికి చేరుకుంది. ఆఖరు దశకు కావాల్సిన కొన్ని పరికరాలూ, సామగ్రి విదేశాల నుంచి తెప్పించాలి. చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఎవరన్నా పేరున్న పారిశ్రామికవేత్తలు, ధనవంతులూ, ఈ పరికరాలు కొనేందుకు ఆర్థికఋణసహాయం చేస్తారేమో అని వాళ్ల చుట్టూ తిరగటం మొదలుపెట్టాను.

ఒక రోజు హఠాత్తుగా రాష్ట్రంలోనే పేరు మోసిన రియల్ ఎస్టేటు కంపెనీ సిరి కన్స్ట్రక్షన్సు నుంచి పిలుపు వచ్చింది వాళ్ల అధినేత నన్ను కలవానుకుంటున్నారని. తీరా చూడబోతే ఆ పారిశ్రామికవేత్త మరెవరో కాదు, మా సునీలే. నన్ను చాలా అప్యాయంగా ఆదరించాడు.

అంత కోట్లకు పడగలెలా ఎత్తానని అడిగాను. ఎలాగోలా ఇంటరు గట్టెక్కిన తరువాత వాళ్ల నాన్న డొనేషను కట్టి

ఎవరికైనా విదేశీయుల గుర్తింపు లభిస్తే ఆకాశానికెత్తేస్తే ప్రచారసాధనాలు, ఆనందు పేరును స్వదేశంలో కూడా మారుమ్రోగేలా చేశాయి. మా నాన్నకి ఈ విషయం చెప్పాను, 'ఎవరినైతే నువ్వు జులాయి అన్నావో, ఇప్పుడు వాడి పేరు ప్రపంచమంతా మ్రోగిపోతోంది. వాడి ఇంట్లో కనకవర్షం కురుస్తోంది' అన్నాను. 'సంతోషం. కానీ అలాంటిదేదైనా నువ్వు సాధిస్తే అప్పుడు చెప్పు. ఇంకా సంతోషిస్తాను' అని ఊరుకున్నాడు నాన్న. నా రీసెర్చి చాలా కీలకస్థితికి చేరుకుంది. ఆఖరు దశకు కావాల్సిన కొన్ని పరికరాలూ, సామగ్రి విదేశాల నుంచి తెప్పించాలి.

ఇంజినీరింగు పేమెంటు సీటు సంపాదించడానికి సిద్ధంగా ఉన్నాడుట. కానీ వీడు నేను ఇంక చదవలేను ససేమిరా అనడంతో ఊరుకున్నాట్ట. అప్పుడు సునీలు ఆ పేమెంటు సీటుకి సిద్ధం చేసిన డబ్బునే పెట్టుబడిగా మార్చి, ఊరి చివరన పోరంబోకుగా ఉన్న స్థలం కొన్నాడుట. ఆ స్థలానికి దగ్గరగా ప్రభుత్వం రింగు రోడ్డు నిర్మించనుండడంతో వాడి దశ తిరిగింది. ఆ స్థలంలో ప్లాటులు వేసి అమ్మాడుట. విపరీతమైన లాభమొచ్చిందిట. ఇక వెనక్కి తిరిగి చూడలేదు. ఇప్పుడు సునీలు నా రీసెర్చికి కావాల్సిన ఆర్థికఋణసహాయం చేస్తానంటున్నాడు. ఆ ప్రతిపాదనకి నేను సంతోషంగా అంగీకరించాను.

కొన్ని నెలల తరవాత నాన్న ఒక నాడు చెమర్చిన కళ్లతో నా వద్దకు వచ్చారు. 'బాబూ, సాధించావురా. ఏ కొద్దిమందికో తప్ప సాధ్యం కానిది నువ్వు సాధించావు. ఈ జన్మకి ఈ సంతోషం చాలు. ఇంటిలోంచి దగ్గరగా రోజూ కనపడే సూర్యుడు కాకుండా, ఎక్కడో దూరాన మినుకు మినుకుమనే నక్షత్రాలు గొప్పవనుకున్నాను. సూర్యుడిని నక్షత్రంగా మారమని పోరాను. కానీ సూర్యుడు కూడా దగ్గరగా ఉన్న ఒక నక్షత్రమేననీ, ఇంటిలో సూర్యుడు దూరమైతే జీవితమే చీకటి అవుతుందని ఆలోచించలేదు. నేను నిన్ను అన్న సూటిపోటి మాటలకి నన్ను మన్నించు' అంటూ ఆ రోజు పేపరు నా చేతికిచ్చి వెళ్లిపోయారు.

'భారతీయపరిశోధకునికి అరుదైన గౌరవం' అనే హెడ్డింగు కింద నా ఫోటోతో సహా, నాకు లభించిన పేటెంటు గురించి, తదుపరి పరిశోధనకై స్టాన్ఫోర్డు విశ్వవిద్యాలయం గ్రాంటు మంజూరు చేసిందనీ, నన్ను గౌరవ అధ్యాపకుడుగా నియమించిందనీ వివరాలు ప్రచురితమయ్యాయి.

నా పేటెంటు ఆధారంగా తయారయ్యే పరికరాల ఉత్పత్తి కంపెనీని, నాన్న చేతుల మీదుగా ప్రారంభించాను. ఆ కంపెనీలో సునీలు, ఆనందు భాగస్వాములు.

ఆ రోజు నాకు మొట్ట మొదటి పెళ్లి చూపులు. తొలిసారి పెళ్లి చేసుకునే ఉద్దేశ్యంతో ఒక అమ్మాయిని చూడటానికి వెళ్లడం, నేను, అమ్మా, నాన్నా కలిసి వెళ్లాము. అమ్మాయిని చూడడం అయిన తరువాత అమ్మాయి తండ్రి అన్నారు,

'అయితే బాబూ మీరు వృత్తిరీత్యా అమెరికా, యూరోపు వెళ్లి ఉండవచ్చా?'

నేను ఓపిగ్గా చెప్పాను. 'ఇక్కడ నాకే ఒక పెద్ద కంపెనీ ఉంది. అది విడిచి అమెరికా, యూరోపులు వెళ్లే అవసరమే రాదు' అని.

దానికి ఆయన, 'కనీసం అప్పుడప్పుడు వ్యాపారం పనుల మీదైనా వెళ్లే వీలుంటుందా బాబూ' అన్నారు. ఉంటుందన్నట్టుగా తల ఆడించాను.

'అలా అయితే మీరు వెళ్లినప్పుడు కొంచం మా అమ్మాయిని కూడా తీసుకెళ్తూ ఉండాలి మరి. మీరు దానికి సరే అంటే మా వైపు నుంచి ఈ సంబంధం ఖాయం' అన్నారాయన. నేను, మా నాన్న వైపు చూశాను.

ఆయన ముఖంలో ఎక్కడో చిరునవ్వు ఉన్నట్టుగా నాకు అనిపించింది. ●